

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు



కొత్తచెరువు, మే 21: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుండి 12.45 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. 24న ఫస్ట్ ల్యాంగ్వేజ్ తెలుగు, 25న సెకండ్ లాంగ్వేజ్ హిందీ, 27న ఇంగ్లిష్, 28న గణితం, 29న ఫిజికల్ సైన్స్, 30న బయలాజికల్ సైన్స్, 31న సోషల్ స్టడీస్, జూన్ 1న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2, సంస్కృతం, అరబిక్ పరీక్షలుంటాయని ఆమె వివరించారు.

చెన్నకేశవా.. గోవిందా..!

- అంగరంగ వైభవంగా చెన్నకేశవుడి బ్రహ్మరథోత్సవం
- పట్టుకేంద్రానికి పోటెత్తిన భక్తజనం
- మార్మోగిన గోవిందనామం



రథంలో ఆసీనులైన లక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు



జనసంద్రం నడుమ కదులుతున్న చెన్నకేశవుడి బ్రహ్మరథం

ధర్మవరం, మే 21: శ్రీదేవీభూదేవి సమేతుడై లక్ష్మీచెన్నకేశవుడు రథంపై తరలివస్తుంటే.. వేలాదిమంది భక్తజనం పులకించిపోయారు. దేవదేవుడి వైభవాన్ని కనులారా వీక్షించి భక్తితన్మయత్వం పొందారు. చెన్నకేశవా.. గోవిందా.. అంటూ బ్రహ్మాండనాయకుడిని కీర్తించారు. వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణతో పట్టుకేంద్రం మార్మోగింది. పట్టణంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం 7 గంటలకు మడుగుతేరు లాగారు. సాయంత్రం 4 గంటలకు బ్రహ్మరథోత్సవం, 6 గంటలకు ధూళోత్సవం నిర్వహించారు. మడుగుతేరుకు వేలాదిమంది భక్తులు హాజరై, రథాన్ని లాగారు. అంతకుముందు స్వామివారిని పట్టణ ప్రముఖులు దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి చెన్నకేశవస్వామి, భూదేవి, శ్రీదేవి ఉత్సవమూర్తులను గజవాహనంపై రథం వద్దకు తీసుకొచ్చారు. అందులో కొలువుదీర్చారు. అనంతరం వేలాదిమంది భక్తులు రథం వద్ద పూజలు నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు బ్రహ్మరథోత్సవాన్ని లాగడానికి మొదలుపెట్టగానే ఆ ప్రాంతమంతా గోవింద నామస్మరణలతో మార్మోగింది. వేలాదిగా భక్తులు తరలిరావడంతో వారిని అదుపు చేయడానికి పోలీసులు ఇబ్బందులు పడ్డారు. బ్రహ్మోత్సవాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. రథోత్సవంలో అన్నమయ్య సేవా మండలి ఆధ్వర్యంలో కళాకారులు సింగానిమేళం, పంచమ వాయుద్యం, బృంద నాట్యాన్ని ప్రదర్శించారు. రథోత్సవంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



రథోత్సవంలో భక్తుల ప్రదర్శన

బైండోవర్ బెదిరింపులు..!



టీడీపీ నాయకులే టార్గెట్‌గా పోలీసుల ఒత్తిడి

హిందూపురం, మే 21: పట్టణంలో సోమవారం తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు పుట్టిన రోజు వేడుకలు చేసుకున్నారు. నియోజకవర్గంలోని పలువురు ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కొంతమంది పోలీసులు అక్కడికి చేరుకుని 'మిమ్మల్ని బైండోవర్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని' చెప్పారు. స్టేషన్‌కు వచ్చి బైండోవర్ కావాలని సూచించారు. పోలీసులు పిలిచినవారిలో కొంత మందిపై ఇప్పటి వరకు ఒక్క పోలీసు కేసు కూడా లేవు. క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ అంతకన్నా లేదు. అయినా తమను బైండోవర్ చేయాలనీ, స్టేషన్‌కు రావాల్సిందేనని పోలీసులు చెప్పడంపై ఆ నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలో చురుగ్గా ఉన్న నాయకులు, కార్యకర్తలను బైండోవర్ చేస్తామని చెప్పడం వాటికి బలం చేకూరుస్తోంది. వారెవరూ వెళ్లలేదు. మంగళవారం కొన్ని పోలీసు స్టేషన్ల నుంచి నాయకులకు ఫోన్లు వెళ్లాయి. 'మీరు పార్టీలో చురుగ్గా ఉన్నారు, బైండోవర్ కావాల్సిందే'నని స్పష్టం చేసినట్లు వారు చెప్పుకొచ్చారు. ఎందుకని ప్రశ్నించగా రాష్ట్రంలో పోలింగ్‌కు ముందు, తరువాత తలెత్తిన ఘర్షణల నేపథ్యంలో బైండోవర్ చేయాలని పైఅధికారులు ఆదేశిస్తున్నారనీ, స్టేషన్‌కు వచ్చి బైండోవర్ అయి సంతకం పెట్టి వెళ్లాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. బైండోవర్‌కు పిలిచిన నాయకులు ఏనాడూ గొడవ పడిన దాఖలాల్లేవు. వాటిని ప్రేరేపించింది కూడా లేదు. అయినా రావాల్సిందేనని పోలీసులు ఒత్తిడి చేస్తున్నారు. జిల్లాలోని టీడీపీ ముఖ్యనేతలు, ఎన్నికల ఏజెంట్లందరికీ బైండోవర్ బెదిరింపులు వస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలో కీలకంగా వ్యవహరించే నాయకులు, కార్యకర్తలపై కూడా బైండోవర్ పేరుతో ఒత్తిళ్లు తెస్తున్నారు. నియోజకవర్గంలో కనీసం 200 మందిని బైండోవర్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో అధికార పార్టీ వారి జోలికెళ్లకుండా టీడీపీ నాయకులే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.

పోలీసు స్టేషన్‌కు రావాలని ఫోన్లు

కౌంటింగ్‌లో కుట్ర కోసమే అంటున్న తెలుగుదేశం నాయకులు

టీడీపీ నాయకులే టార్గెట్

బైండోవర్ కావాలని తెలుగుదేశం, కూటమి నాయకులపై రెండు, మూడు రోజులుగా పోలీసులు ఒత్తిడి చేస్తున్నారు. అధికార పార్టీ వర్గాల జోలికెళ్లలేదని తెలుస్తోంది. అన్ని పార్టీల నాయకులను బైండోవర్ చేస్తున్నామని పోలీసులు చెబుతున్నా.. టీడీపీపైనే ప్రధానంగా దృష్టి పెట్టారన్నది నిర్వివాదాంశం. పట్టణంలోని ఒక్కో పోలీసు స్టేషన్ పరిధిలో 20 నుంచి 30 మందిని బైండోవర్ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ లెక్కన పార్టీలో చురుగ్గా పాల్గొనే నాయకులందరినీ చేయాల్సి ఉంటుంది. అలా చేస్తే కౌంటింగ్ రోజు అధికార పార్టీ నాయకులకు అడ్డం ఉండదన్న ఉద్దేశంతోనే తమపై పోలీసులు ఒత్తిడి తెస్తున్నారని కూటమి నాయకులు అంటున్నారు. సాధారణంగా ఎన్నికల ముందు బైండోవర్ చేస్తారు. కొన్నిచోట్ల పోలీసుల వైఫల్యంతో ఘర్షణలు తలెత్తాయి. దీనిని ఆసరాగా చేసుకుని, టీడీపీ నాయకులను టార్గెట్ చేయడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.



కౌంటింగ్‌లో కుట్ర కోసమేనా?

అధికార పార్టీ నాయకులు ఐదేళ్లుగా అరాచకాలు, దౌర్జన్యాలు సాగించారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ వైసీపీ నాయకుల ఆగడాల తారస్థాయికి చేరాయి. సార్వత్రిక ఎన్నికల్లో కూడా అధికార పార్టీ నాయకులు ఓటమిని అంగీకరించలేక, కూటమికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక రెచ్చిపోయారు. పోలింగ్ సమయంలోనే ఇలా ఉంటే.. కీలకమైన కౌంటింగ్ రోజు ఎలా ఉంటుందో, అధికార పార్టీ నాయకులు ఏ రీతిలో రెచ్చిపోతారో ఊహించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో టీడీపీ వారిని బైండోవర్ చేసి, వారి నోరు మూయించాలనా, అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించడానికా ఈ బైండోవర్‌లని కూటమి నాయకులు ప్రశ్నిస్తున్నారు. కౌంటింగ్‌లో అధికార పార్టీ కుట్ర చేయడానికి ఇలా ముందస్తు బైండోవర్లు జరుగుతున్నాయా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అది కూడా ముఖ్యనాయకులే టార్గెట్‌గా బైండోవర్ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది పోలీసులకే తెలియాలి. పోలీసు స్టేషన్‌కు రావాలని ఒత్తిడి చేస్తున్నా నాయకులు మాత్రం నిరాకరిస్తున్నారు.



బైండోవర్ అంటే..



పోలీసులు సీఆర్‌పీ 107 ప్రకారం బైండోవర్ చేస్తుంటారు. నేర చరిత్ర ఉన్నా.. ఏదైనా గొడవలో పాల్గొన్న వారికి పరోక్షంగా సహకరించినట్లు సాక్షాలుంటే వారిని బైండోవర్ చేస్తారు. వాస్తవానికి రెండేళ్ల క్రితమే హైకోర్టు బైండోవర్ కేసులపై తీవ్రంగా స్పందించింది. సీఆర్‌పీ 107 కింద బైండోవర్ పెట్టే అధికారం తహసీల్దార్‌కు మాత్రమే ఉంటుంది. పోలీసులకు లేదని స్పష్టం చేసింది. అయినా పోలీసులు బైండోవర్ అస్త్రాన్ని యథేచ్ఛగా వాడుకుంటూ హైకోర్టు ఉత్తర్వులను తుంగలో తొక్కుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. బైండోవర్ చేసిన వ్యక్తుల నుంచి రూ.లక్ష బాండ్ తీసుకుంటారు. గొడవ పడితే ప్రభుత్వానికి రూ.లక్ష చెల్లించాలి. దీనిని అడ్డం పెట్టుకుని, ప్రతిపక్ష నాయకులను వేధించడం వైసీపీ ఐదేళ్ల పాలనలో పరిపాటిగా మారింది. కౌంటింగ్‌కు 15రోజులు ముందుగానే బైండోవర్ అస్త్రాన్ని పోలీసులు తెరమీదకు తీసుకురావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఎన్నికలకు ముందు వైసీపీ యువజన నాయకులను బైండోవర్ చేశారు. సదరు యువనాయకుడు బైండోవర్ అయ్యాక అదే పార్టీకి చెందిన నాయకుడిపై హత్యాయత్నం చేశాడు. అయినా ఆ కేసును నీరుగార్చారు. సబ్ కలెక్టర్ వద్ద బైండోవర్ చేయించిన నాయకుడు ఘటనకు పాల్పడినా అతడిపై కూడా చర్యల్లేవు. ఈ నేపథ్యంలో ఏ కేసులో లేని టీడీపీ నాయకులను బైండోవర్ చేయడం పోలీసులకే చెల్లుతుందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఏది ఏమైనా కౌంటింగ్‌కు ముందు బైండోవర్లతో టీడీపీ నాయకులను బెదిరిస్తున్నారని ఆ పార్టీ వర్గాలు దుమ్మెత్తి పోస్తున్నాయి.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీతో కలిసి స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



హిందూపురం కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి/హిందూ పురం, మే21(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు వెల్లడించారు. హిందూపురం ఎంపీ స్థానం, ఆరు అసెంబ్లీ నియోజక వర్గాల ఈవీఎంలు, వీవీ ప్యాట్లను భద్రపరచిన లేపాక్షి మండలం చోళసముద్రం గ్రామ సమీపానగల అంబేడ్కర్ గురుకుల పాఠశాల, హిందూపురంలో బిట్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ మాధవరెడ్డితో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. భద్రతాపరమైన అంశాలపై ఆరాతీస్తూ, పలు సూచనలు ఇచ్చారు. పోలింగ్ తరువాత రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అల్లర్ల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు వచ్చేవారి వెంట ఎలాంటి ఆయుధాలు, ఇతరాత్ర వస్తువులు తీసుకురాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పాసులున్నవారు, ఏజెంట్లు మినహా ఎవరినీ కౌంటింగ్ కేంద్రాల దరిదాపుల్లోకి రానీయకూడదనీ, అందుకు పోలీసులు ఇప్పటి నుంచి చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌వద్ద తనిఖీలు చేసి, సీసీ కెమెరాల పనితీరును ఆరాతీశారు. వీరి వెంట వివిధ నియోజకవర్గాలకు చెందిన ఆర్‌ఓలు ఉన్నారు.

నేడు నృసింహ జయంతి

- ముస్తాబైన ఖాద్రీశుడి ఆలయం





ముస్తాబైన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ముఖద్వారం, ఆవరణం

కదిరి, మే 21: నృసింహజయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, వాహనసేవ నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. స్వాతి నక్షత్రం సందర్భంగా నృసింహజయంతి నిర్వహించనున్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడై వసంత వల్లభుడు శేషవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారన్నారు. నృసింహ జయంతికి ఖాద్రీశుడి ఆలయం ముస్తాబైంది. ప్రత్యేక అలంకరణ, ఏర్పాట్లు చేపట్టారు.

రేపు మల్లెపూలోత్సవం

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి గురువారం మల్లెపూల మండపంలో మల్లేపూలోత్సవాన్ని నిర్వహించనున్నారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం సాయంత్రం 4గంటలకు స్వామివారు ఆలయం నుంచి బయలుదేరి మల్లెపూల మండపానికి చేరుతారన్నారు. కదిరి మల్లెలతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించనున్నారు. అనంతరం తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ వెల్లడించారు.

పురంలో భారీ వర్షం

పుట్టపర్తి రూరల్, మే 21: హిందూపురంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఏకంగా 52.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాన పడినట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అమరాపురం 41.6 మి.మీ, గోరంట్ల 38.2 మి.మీ, బత్తలపల్లి 37.6 మి.మీ, కనగానిపల్లి 33.2 మి.మీ, నల్లమాడ 31.2 మి.మీ, సోమందేపల్లి 30.8 మి.మీ, బుక్కపట్నం 29.4 మి.మీ, కొత్తచెరువు 29.4 మి.మీ, ఓబుళదేవరచెరువు 28.4 మి.మీ, తాడిమర్రి 28.2 మి.మీ, పరిగి 26.4 మి.మీ, ముదిగుబ్బ 24.6 మి.మీ, పుట్టపర్తి 19.2 మి.మీ, చిలమత్తూరు 16.4 మి.మీ, అగళి 16.2 మి.మీ, పెనుకొండ 16.2 మి.మీ, రొళ్ల 15.4 మి.మీ, లేపాక్షి 14.4 మి.మీ, రొద్దం 13.0 మి.మీ, మడకశిర 12.6 మి.మీ, కదిరి 12.2 మి.మీ, రామగిరి 10.8 మి.మీ, చెన్నేకొత్తపల్లి 10.4 మి.మీ, గాండ్లపెంట 10.2 మి.మీ, తలుపుల 9.4 మి.మీ, గుడిబండ 9.4 మి.మీ, నల్లచెరువు 8.6 మి.మీ, ధర్మవరం, నంబులపూలకుంట 8.4 మి.మీ, అమడగూరులో 6.6 మి.మీ వర్షం కురిసినట్లు వెల్లడించారు.

కలెక్టరేట్‌కు హంగులు



పుట్టపర్తి, మే 21: స్థానిక కలెక్టరేట్‌కు కొత్తహంగులు సమకూరుస్తున్నారు. కార్యాలయంలో గోడలకు అలంకరణతోపాటు కొత్తగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ముందుభాగాన ఆంగ్లం, తెలుగులో బోర్డులను ఏర్పాటు చేసి, విద్యుద్దీపాలతో అలంకరించారు. నేమ్ బోర్డు ముందు పచ్చిక బయలు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌మీద కొత్తహంగుల కోసం గోడలు నిర్మించడంతో పాదచారులు వెళ్లేందుకు వీలులేకుండా పోతోంది. సాధారణంగా రోడ్డుపై ప్రైవేటు వ్యక్తులు కట్టడాలు చేపడితే అధికారులు తొలగిస్తారు. అలాంటి అధికారులే ఫుట్‌పాత్‌ను ఆక్రమించి, సుందరీకరణ పనులు చేపట్టడం ఇదెక్కడి చోద్యమంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

పంపకాల్లో తేడా

కొట్టుకున్న వైసీపీ కౌన్సిలర్లు

- అధికార పార్టీ కార్యాలయంలో ఘర్షణ
- మిన్నకుండిపోయిన అభ్యర్థి భర్త
- సమీక్షలో నాయకుల కాకి లెక్కలు
- ముక్కున వేలేసుకున్న మిగతావారు



హిందూపురం, మే 21: ఎన్నికల డబ్బు పంపకాల్లో తేడా పట్టణానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య ఘర్షణకు దారితీసింది. 'నా వార్డుకు సంబంధించిన ఓటర్లకు పంచే డబ్బులను తీసుకెళ్లేందుకు నీవెవడివి రా..' అంటూ వైసీపీ కౌన్సిలర్.. మరో కౌన్సిలర్‌పై మంగళవారం చేయిచేసుకున్నాడు. పోలింగ్ ముగిసిన తరువాత వైసీపీ స్థానిక కార్యాలయంలో ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి దీపిక భర్త వేణురెడ్డి హిందూపురం పట్టణం, రూరల్ మండల నాయకులతో పోలింగ్ సరళిని తెలుసుకునేందుకు సమీక్ష నిర్వహించారు. మొదట హిందూపురం మండలంలో పంచాయతీల వారీగా పోలింగ్ సరళిని తెలుసుకుని, డబ్బు పంపకాలపై ఆరాతీశారు. మండల సమీక్ష ముగిశాక పట్టణంలోని వార్డుల సమీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణురెడ్డి కోటరీలో కీలకంగా వ్యవహరించే ఓ కౌన్సిలర్ లేచి తనకు వ్యక్తిగత పని ఉందనీ, తన వార్డునుంచి ప్రారంభించాలని కోరినట్లు తెలిసింది. అందుకు వేణురెడ్డి సరే అన్నారు. దీంతో ఆ వార్డు నుంచి సమీక్షను ప్రారంభిస్తుండగానే గాంధీనగర్ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మరో కౌన్సిలర్ లేచి 'నా వార్డుకు సంబంధించిన ఓటర్ల డబ్బు నీవెందుకు తీసుకెళ్లావు? ఆ డబ్బు ఏం చేశావం'టూ మరో కౌన్సిలర్‌ను నిలదీశాడు. దీంతో మాటామాటా పెరిగి కౌన్సిలర్లు కొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న రెండు వార్డులకు చెందిన నాయకులు, వారి సన్నిహితులు అక్కడికి చేరుకుని హంగామా సృష్టించారు. ఇంత జరుగుతున్నా వేణురెడ్డి మాత్రం మిన్నకుండిపోయినట్లు సమాచారం. లక్షలాది రూపాయలు తీసుకెళ్లి, తన వార్డు ఓటర్లకు పంచకుండా ఎగ్గొట్టావని కౌన్సిలర్ నిలదీశాడు. వార్డులోకి వెళ్తే అందరూ డబ్బు ఇవ్వలేదని తనను నిలదీస్తున్నారని ఆ కౌన్సిలర్ వాపోయాడు. ఓటర్ల వద్ద చులకనయ్యానని ఆవేదన వ్యక్తం చేశాడు. అక్కడే ఉన్న మిగతా వారు ఇరువర్గాలకు సర్దిచెప్పారు. అనంతరం మిగిలిన వార్డుల సమీక్ష కొనసాగించారు. హిందూపురం మండలంలోని కొన్ని పంచాయతీల నాయకులు కాకిలెక్కలు చెప్పారు. పల్లెల్లో ఈసారి వైసీపీకి మెజార్టీ వస్తుందని చెప్పుకొచ్చారు. ఇదే సందర్భంలో పట్టణంలోని కొన్ని వార్డులకు చెందిన నాయకులు కూడా తమ పరిధిలో మెజార్టీ సాధిస్తామని చెప్పుకొచ్చారు. తెలుగుదేశం పార్టీకి ఆయువుపట్టయిన ప్రాంతాల్లో కూడా వైసీపీ మెజార్టీ వస్తుందని చెప్పడంతో అక్కడే ఉన్న కొంతమంది వైసీపీ నాయకులు ముక్కున వేలేసుకున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా అధికార పార్టీలో డబ్బు పంపకాల్లో వచ్చిన తేడాల వల్ల కౌంటింగ్ ముగిశాక ఎంత మంది నాయకులు, కౌన్సిలర్లు కొట్టుకుంటారో వేచి చూడాలి.

గెలుపు ఆమెదేనా?

- ఉమ్మడి జిల్లాలో ఏడుగురు మహిళల పోటీ
- అసెంబ్లీకి ఆరుగురు.. పార్లమెంటు బరిలో ఒకరు
- టీడీపీ తరుపున నలుగురు, వైసీపీ నుంచి ముగ్గురు
- కూటమి అభ్యర్థులకే విజయావకాశాలంటున్న విశ్లేషకులు



అనంతపురం, మే 21(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి జిల్లాలో మహిళలకు అత్యధిక సీట్లు దక్కాయి. ఆరుగురు మహిళలు అసెంబ్లీకి, ఒకరు పార్లమెంటు స్థానానికి పోటీ పడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుం చి ముగ్గురు మహిళలకు మాత్రమే పోటీచేసే అవకాశం దక్కింది. అందులో ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం శింగనమల నుంచి జొన్నలగడ్డ పద్మావతి, బండారు శ్రావణిశ్రీ పోటీపడ్డారు. వీరిలో వైసీపీ తరుపున పోటీ చేసిన జొన్నలగడ్డ పద్మావతి విజయం సాధించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా ఉష శ్రీచరణ్ పోటీ చేసి గెలుపొందారు. జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు నియోజకవర్గాలుండగా ఇద్దరు మహిళలు మాత్రమే గత ఎన్నికల్లో గెలుపొంది చట్టసభల్లో ప్రవేశించారు

ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తున్నారంటే...

ఉమ్మడి జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు స్థానంలో మహిళా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇప్పటికే పోలింగ్ ముగిసిన నేపథ్యంలో వారి భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. కూటమి టీడీపీ తరఫున నాలుగు అసెంబ్లీ స్థానాల నుంచి మహిళా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అధికార వైసీపీ నుంచి ఇద్దరు మహిళా అభ్యర్థులు అసెంబ్లీ, ఒకరు పార్లమెంటు స్థానం నుంచి బరిలో ఉన్నారు. కూటమి తరఫున రాప్తాడు నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత, పెనుకొండ నుంచి సవిత, శింగనమల నుంచి బండారు శ్రావణిశ్రీ, పుట్టపర్తి నుంచి పల్లె సింధూరారెడ్డి పోటీ చేశారు. ఇక వైసీపీ తరఫున పెనుకొండ నుంచి మంత్రి ఉష శ్రీచరణ్, హిందూపురం నుంచి దీపిక పోటీ చేస్తుండగా... హిందూపురం పార్లమెంటు స్థానం నుంచి శాంతమ్మ పోటీ చేశారు.

గెలుపెవరిదో..?

ఉమ్మడి జిల్లాలో పోటీ చేసిన మహిళా అభ్యర్థుల్లో ఎవరు గెలుస్తారోననే విషయం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే టీడీపీ అభ్యర్థులకే విజయావకాశాలు మెండుగా ఉన్నాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇందుకు కూటమి మేనిఫెస్టోపై ప్రజల్లో సంతృప్తి ఒక కారణమైతే... వైసీపీ పాలనపై వ్యతిరేకత మరో కారణంగా చెబుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో బటన్ నొక్కుడు తప్పా... జిల్లాలో ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపకపోవడంతో నిరుద్యోగ యువతలో వైసీపీ పాలన పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వైసీపీ ప్రజాప్రతినిధుల అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, అవినీతిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది.

ఓటమెరుగని పరిటాల సునీత



టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి పరిటాల సునీత రాప్తాడు నుంచి పోటీ చేశారు. ఆమె రాజకీయాల్లోకి వచ్చిన నాటినుంచి పోటీచేసిన ప్రతి ఎన్నికల్లోనూ గెలుపొందుతూ వచ్చారు. 2019లో ఆ నియోజకవర్గం నుంచి ఆమె స్థానంలో తనయుడు పరిటాల శ్రీరామ్ పోటీచేసి ఓటమి చవిచూశారు. అయితే ఈ ఎన్నికల్లో తిరిగి పరిటాల సునీత పోటీ చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించిన ఆమె చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. ఆ కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం ఆమెపై పోటీ చేసిన వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దౌర్జన్యాలు, అక్రమాలు యథేచ్ఛగా కొనసాగించారనే విమర్శలు వారిపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరిటాల సునీత వైపే విజయావకాశాలు ఉన్నాయనే అభిప్రాయం విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతోంది.

మంత్రికి ఎదురు దెబ్బేనా?



పెనుకొండ నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున పోటీ చేస్తున్న మంత్రి ఉష శ్రీచరణ్ కళ్యాణదుర్గానికి ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. అక్కడ ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమెను పెనుకొండ నుంచి ఆ పార్టీ అధిష్ఠానం పోటీ చేయించింది. ఆ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి రామచంద్రారెడ్డి కుమార్తె సవిత పోటీ చేశారు. ఈమె లోకల్ కావడం మంత్రి ఉష శ్రీచరణ్‌కు పెద్ద ఎదురుదెబ్బే.

శ్రావణిశ్రీకి కలిసొస్తున్న కాలం!




శింగనమల నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి సానుభూతిపవనాలు మెండుగా వీస్తున్నాయి. అధికార వైసీపీ నుంచి కొత్త వ్యక్తిని రంగంలోకి దింపడంతో ఆ పార్టీలోని ఆ నియోజకవర్గ దళిత నేతల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడం శ్రావణికి కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. దీనికి తోడు ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త, ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి మీద అనేక అవినీతి, ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికార పార్టీ సామాజికవర్గంలోని కొందరు నేతలు ఆ దంపతుల వ్యవహారశైలిపై గుర్రుగా ఉన్నారు. ఈ పరిణామాలే శ్రావణిశ్రీ విజయానికి దోహదపడతాయంటున్నారు.

విజయ 'సింధూర'మే?



పుట్టపర్తి నియోజకవర్గం నుంచి కూటమి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు పల్లె సింధూరరెడ్డిని పోటీలో నిలపడంతో మహిళల్లో మంచి ఆదరణ కనిపిస్తోంది. మామపై ఎలాంటి అవినీతి, అరోపణలు లేకపోవడానికి తోడు సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రస్తుత వైసీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డిపై అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలు ఉన్నాయి. అలాగే అధికార పార్టీ సామాజికవర్గంలోని కొందరు శ్రీధర్‌రెడ్డిపై గుర్రుగా ఉండటం సింధూరరెడ్డి గెలుపునకు కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు.



దీపికకు కష్టమే..





దీపిక

హిందూపురం నియోజకవర్గం నుంచి మూడోసారి టీడీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పోటీ చేశారు. అధికార వైసీపీ నుంచి కొత్తగా దీపికను బరిలో నిలిపారు. ఈ నియోజకవర్గం టీడీపీకి తొలి నుంచి కంచుకోట కావడంతో బాలకృష్ణ హ్యాట్రిక్ కొట్టడం తథ్యమంటున్నారు.

పార్లమెంట్ బరిలో లోకల్ వర్సెస్ నాన్ లోకల్



హిందూపురం పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి పోటీలో ఉన్నారు. అధికార వైసీపీ నుంచి శాంతమ్మ బరిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్మన్‌గా పని చేసిన బీకేకి 14 నియోజకవర్గాల్లో పార్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగానూ బలమైన పరిచయాలు ఉన్నాయి. దీనికి తోడు ఆయన సామాజికవర్గమూ ఆ పార్లమెంటు స్థానంలో బలంగా ఉంది. అధికార వైసీపీ అభ్యర్థిది పొరుగు రాష్ట్రం బళ్లారి జిల్లా కావడంతో లోకల్, నాన్ లోకల్ అనే భావన అందరిలోనూ వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేసే అర్హత తమకు లేదా అనే అసంతృప్తి స్థానిక నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఈ పర్యవసానాలన్నీ టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి గెలుపుకు దోహదపడుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే గెలుపెవరన్నది తెలియాలంటే మరిన్ని రోజులు ఆగాల్సిందే.

'పీఎం బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, మే 21 : జాతీయ స్థాయిలో 2025లో అందించే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో విశేషమైన ప్రతిభ చూపిన బాలలకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు అందిస్తుందన్నారు. అర్హులైన బాలలు జులై 31వ తేదీలోగా http ://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివారలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హులకు 2025 జనవరి 26వ తేదీ ఢిల్లీలో గణతంత్ర దినోత్సవం రోజున ప్రధానమంత్రి చేతుల మీదుగా అందజేస్తారని తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.37వేలు

అనంతపురంరూరల్, మే 21: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కె ట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 763 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



విద్యుత్ శాఖకు రూ.37.72లక్షల నష్టం

- ఈదురుగాలులకు నేలకొరిగిన స్తంభాలు..ట్రాన్స్‌ఫార్మర్లు

అనంతపురం రూరల్, మే21: ఈదురుగాలుల కారణంగా ఉమ్మడిజిల్లాలో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ శాఖ సర్కిల్ ఆరుడివిజన్ల పరిధిలో 162 విద్యుత్ స్తంభాలు, 12ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. దీంతో విద్యుత్ శాఖకు రూ.37.72 లక్షల నష్టం జరిగినట్లు సంబంధిత అధికారులు అంచనా వేశారు. కళ్యాణదుర్గం , అనంతపురం టౌన్ డివిజన్ పరిధిలో అత్యధికంగా విద్యుత్ శాఖకు నష్టం జరిగింది. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 39 విద్యుత్ స్తంభాలు, 5ట్రాన్స్‌ఫార్మర్లు, అనంతపురం టౌన్ డివిజన్ పరిధిలో 45 విద్యుత్ స్తంభాలు, 3ట్రాన్స్‌ఫార్మర్లు, అనంతపురం రూరల్ డివిజన్ పరిధిలో 22 స్తంభాలు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, గుత్తి డివిజన్ పరిధిలో 34స్తంభాలు, హిందుపురం డివిజన్‌లో 17స్తంభాలు, కదిరిలో 5స్తంభాలు నేలకొరిగాయి. ఈదురుగాలు, వర్షం కారణంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం రాత్రి 8గంటల నుంచి ఆయా ప్రాంతాల్లో సంబంధిత అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. స్తంభా లు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడంతో చాలా ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ పునరుద్ధరణ కాని పరిస్థితులున్నాయి. అనంతపురం టౌన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌లైన్ల మరమ్మత్తులు చేపట్టి మధ్యాహ్నం మూడుగంటలకు విద్యుత్ సరఫరా అందించారు. మరి కొన్ని ప్రాంతాల్లో రాత్రి 7గంటల వరకు కూడా విద్యుత్ పునరుద్ధరణ కాని పరిస్థితులు నెలకొన్నాయి. అంధకారంలో ప్రజలు రాత్రంతా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నగరంలో నేలకూలిన విద్యుత్ స్తంభాలు



నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్..!

- రూ.కోట్ల బకాయిలపై ఆస్పత్రి యాజమాన్యాల సీరియస్

అనంతపురం టౌన్, మే21 : పేదలకు అండగా నిలిచి ఆరోగ్యాన్ని అందించిన ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. రూ.కోట్ల రూపాయల బకాయిలు చెల్లించకపోవడంతో ఆస్పత్రి యాజమాన్యాలు తిరుగు బావుటా ఎగరవేయడానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించిన ప్రైవేటు, కార్పోరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సేవల నిలుపుదలకే నిర్ణయం తీసుకున్నారుయి. పలు మార్లు సేవల బంద్‌కు పిలుపునిచ్చినా ప్రభుత్వం వారితో చర్చలు జరుపుతూ కొంత మొత్తాన్ని చెల్లిస్తూ వచ్చింది. దీంతో పాటు కొందరు ప్రభుత్వ పెద్దలు బెదిరింపులకు దిగడంతో సమ్మెను విరమించుకుంటూ వస్తున్నారు. తాజాగా అప్పులు చెల్లించాలని లేకపోతే బుదవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీస్ ఇచ్చారు. ఈసారి ఎంత బెదిరించినా, బుజ్జగించినా వెనక్కి తగ్గేది లేదని, బకాయిలు చెల్లించేవరకు సేవలు అందించేది లేదని అసోషియన్ నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇదే జరిగితే జిల్లాలో 44 కార్పోరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కానున్నాయి. ఇప్పటికే ఆమేరకు జిల్లాలో కూడా ఆస్పత్రుల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు బంద్ అయితే తమ పరిస్థితి ఏంటని పలు పేదవర్గాలు ఆందోళన చెందుతున్నారు.

- అధికారుల రికార్డుల ఆదారంగా రోజుకు జిల్లాలో వివిద వ్యాదులకు సంబంధించి దాదాపు 500నుంచి 750మంది వరకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు పొందుతున్నారు. ఆస్పత్రులు బంద్ చేస్తే సీరియస్ కేసుల పరిస్థితి ఏంటనే ఆందోళన మొదలైంది. అయితే ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌ను అడిగితే మాత్రం ఆరోగ్యశ్రీ సేవల బంద్‌కు నోటీస్ ఇచ్చిన మాట వాస్తవమేనని, అయితే రాష్ట్ర స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, బకాయిలు చెల్లించే అవకాశం ఉందని, దీంతో వైద్యసేవలు యథాతతంగా కొనసాగుతాయని తెలిపారు. ఏమి జరుగుతుందో వేచి చూడాలి మరి..?

తాడిపత్రి వైసీపీ నేతల కోసం గాలింపు

బుక్కరాయసముద్రం, మే 21: తాడిపత్రి నియోజకవర్గంలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఘర్షణ ఘటనలో నిందితులుగా ఉన్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి అనుచరుల కోసం పోలీసులు గాలింపులు చర్యలు చేపట్టారు. మండలంలోని జంతులూరులో వైసీపీ సర్పంచ్ లక్ష్మిరెడ్డి తోటలో తాడిపత్రి ఘటనలో ఉన్న నిందితులు ఉన్నట్లు జిల్లా పోలీసు అధికారులకు మంగళవారం సమాచారం అందింది. జిల్లా ప్రత్యేక పోలీసు బృందంతో పాటు స్పెషల్ పార్టీ, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, బుక్కరాయసముద్రం పోలీసులు ఆ తోటపై దాడులు నిర్వహించారు. విషయాన్ని తమ అనుచరుల ద్వారా సమాచారం అందుకోవడంతో అక్కడి నుంచి వైసీపీ నేతలు పరారైనట్లు సమాచారం. ఆ తోటలో బిర్యానీలు, మందు సీసాలు ఉండటాన్ని పోలీసులు గమనించారు. ఆ గ్రామంలోని పలు తోటల్లో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... గ్రామాల్లోకి ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

వైసీపీ నాయకుడి వాహనాల సీజ్

రాప్తాడు, మే 21: మండలంలోని గొందిరెడ్డిపల్లి సమీపంలో గుట్టలో నుంచి అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న పుల్లలరేవు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు అంజికి చెందిన రెండు వాహనాలను సీజ్ చేశామని రాప్తాడు పోలీసులు తెలిపారు. మంగళవారం ఎర్రమట్టి తవ్వే ప్రదేశానికి వెళ్లి అనుమతి లేకుండా తరలిస్తున్న ఒక టిప్పర్, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ వాహనాలను రాప్తాడు పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి సీజ్ చేశామని, వాటిని మైన్స్ అధికారులకు అందజేస్తామని తెలిపారు.

శివపురంలో వైసీపీ రౌడీయిజం

- ఎన్నికల్లో టీడీపీకి పనిచేశారని దాడి
- నలుగురికి తీవ్ర గాయాలు

శింగనమల, మే 21: ఎన్నికల్లో టీడీపీ కోసం పనిచేసినందుకు వైసీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారు. శింగనమల మండలం శివపురంలో టీడీపీ కార్యకర్త ఇంట్లోకి మంగళవారం సాయంత్రం చొరబడి కొడవళ్లతో దాడి చేశారు. దీంతో నలుగురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన బోయ పెద్దన్న, కొండప్ప అన్నదమ్ములు. వీరు టీడీపీ కార్యకర్తలు. పెద్దన్నకు అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకడు పత్రా వెంకటప్ప కుటుంబానికి పొలం వద్ద రస్తా తగాదా ఉంది. ఎన్నికల్లో పెద్దన్న టీడీపీ తరఫున పనిచేశారు. దీంతో ఆ పార్టీ కోసం పనిచేయొద్దని వైసీపీ నాయకులు పెద్దన్నను పలు మార్లు హెచ్చరించారు. అయినా పట్టించుకోకుండా పనిచేయడంతో వైసీపీ నాయకులు కక్ష కట్టారు. వైసీపీ వర్గీయులు ప్రసాద్, మురళి, శేఖర్, రాజు, వెంకటరమయ్య, భాస్కర్, క్రాంతి తదితరులు మద్యం సేవించి పెద్దన్న ఇంటిపై దాడి చేశారు. పెద్దన్న వారి నుంచి తప్పించుకుని, తన అన్న కొండప్ప ఇంట్లోకి దూరాడు. వెంబడించిన వైసీపీ వర్గీయులు.. కొండప్ప ఇంట్లోకి చొరబడి కొండప్ప, ఆయన కూతురు హిమాజకూమారి, అల్లుడు మురళి, పెద్దన్న భార్య పద్మావతిపై దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో నలుగురినీ అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని శింగనమల ఏఎస్ఐ చితంబరప్ప తెలిపారు.



గాయపడ్డ కొండప్ప



పద్మావతి



హిమజ కూమారి

తాడిపత్రికి మళ్లీ సిట్

- పోలీసులకు కునుకు కరువు

తాడిపత్రి టౌన్, మే 21: సిట్ బృందం తాడిపత్రికి మరోసారి వచ్చింది. పోలింగ్, ఆ మరుసటి రోజు జరిగిన గొడవల గురించి సిట్ అధికారులు మంగళవారం మరోమారు విచారించారు. సిట్ సభ్యులు శ్రీనివాసులు, భూషణం, శ్రీనివాస్ తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. రికార్డులను, అల్లర్లకు సంబంధించిన వీడియోలను పరిశీలించారు. హింసాత్మక ఘటనల గురించి పూర్తిస్థాయి వివరాలు సేకరించేందుకు మరోసారి వారు వచ్చినట్లు సమాచారం. గొడవ జరగడానికి ప్రధాన కారణం, రాళ్లదాడి జరిగినా పోలీసులు ఎందుకు నియంత్రించలేకపోయారని స్థానిక పోలీసులను అడిగినట్లు తెలిసింది. గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఎస్‌బీ అధికారులు ముందే గుర్తించి సమాచారం ఇచ్చారా..? లేదా..? సమాచారం ఇచ్చినా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారా..? అనే కోణాల్లో సిట్ దర్యాప్తు చేస్తోందని సమాచారం. తాడిపత్రి గొడవల నేపథ్యంలో ఇప్పటికే ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ సస్పెండ్ అయ్యారు. సిట్ దర్యాప్తు తరువాత తమ పరిస్థితి ఏమిటోనని పోలీసులు ఆందోళన చెందుతున్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ సిట్ బృందం తాడిపత్రిలోనే తిష్ట వేస్తుందని ప్రచారం సాగుతోంది. దీంతో స్థానిక పోలీసులకు కంటిమీద కునుకు కరువైంది.



రూరల్ పీఎస్‌లో సిట్ అధికారుల వాహనం

నా లెక్క నాకి పడెయ్..!

- అసమ్మతి వర్గీయుడి ఇంటిపైకి ఎమ్మెల్యే బంధువులు
- టీడీపీ తరఫున ప్రచారం చేశారని దాడికి యత్నం

శింగనమల, మే 21: ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి తరఫున ప్రచారం చేసినందుకు వైసీపీ అసమ్మతి నాయకుడు పట్నం నగేష్ ఇంటిపై ఆ పార్టీ నాయకులు దాడికి యత్నించారు. తమ బకాయి డబ్బులు చెల్లించాలని దూషణకు దిగారు. ఈ ఘటన శింగనమల మండలం చిన్నజలాలపురంలో మంగళవారం చోటుచేసుకుంది. శింగనమల వైసీపీ టిక్కెట్‌ను సిటింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి వర్గీయుడైన వీరాంజనేయులుకు ఆ పార్టీ కేటాయించింది. దీంతో ఎమ్మెల్యే, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డిని వ్యతిరేకించే వర్గం ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తరఫున పనిచేసింది. ఈ వర్గంలో పట్నం నగేష్ ఒకరు. దీంతో ఆగ్రహించిన ఆలూరు సాంబశివారెడ్డి మేనమామ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఆయన బావమరిది బాలిరెడ్డి, సొదనపల్లి సర్పంచ్ గోపాల్ రెడ్డి తదితరులు నగేష్ ఇంటి వద్దకు వెళ్లారు. బకాయి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ దాడికి యత్నించారు. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి నుంచి జారుకున్నారు. ఈ ఘటనపై శింగనమల పోలీస్ స్టేషన్ పట్నం నగేష్ ఫిర్యాదు చేశారు. శ్రీరామిరెడ్డికి తాను బకాయి లేనని, ఇవ్వాల్సిన రూ.3.50 లక్షలు గతంలోనే ఇచ్చేశానని నగేష్ అన్నారు. అసమ్మతివర్గం సమావేశానికి వెళ్లినందుకు గతం లో తన తోటకు నిప్పు పెట్టి నష్టం కలిగించారని, ఎమ్మెల్యే భర్త, వారి బంధువు శ్రీరామిరెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని బాధితుడు పేర్కొన్నాడు.



పట్నం నగేష్ ఇంటివద్ద గొడవకు దిగుతున్న వైసీపీ నాయకులు

పరీక్ష తప్పినందుకు మనస్థాపంతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

పుట్టపర్తి రూరల్, మే 21: పరీక్ష తప్పానన్న మనస్థాపంతో బీటెక్ విద్యార్థి గౌతమ్ (23) ఆత్మహత్య చేసుకున్న ఘటన మునిసిపల్ పరిధిలోని ఎనుమలపల్లి గణేష్‌కూడలిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎనుమలపల్లి గణేష్‌కూడలిలో కాపురమంటున్న ఆనంద్, ఉషా దంపతుల కుమారుడు గౌతమ్. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈక్రమంలో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. ఆ సబ్జెక్టులను ఇటీవల జరిగిన సప్లిమెంటరీలో రాశాడు. తిరిగి పరీక్షల్లో ఫెయిలవ్వడంతో మనస్థాపం చెందాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఆనంద్ స్థానికంగా ఓ విల్లాలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి తెలిపారు.



విద్యార్థి గౌతమ్ (ఫైల్)



వీర ఓబునపల్లిలో ట్రాక్టర్‌తో దుక్కి.

ముంగారు సేద్యం ప్రారంభం

ఓబుళదేవరచెరువు, మే 21: మండలవ్యాప్తంగా సోమవారం రాత్రి ఓ మోస్తారు వర్షం కురవడంతో పలుచోట్ల రైతులు ముంగారు సేద్యాలను ప్రారంభించారు. మండలంలోని నారప్పగారిపల్లి, వెంకటాపురం, వీరఓబునపల్లి, దొన్నికోటవారిపల్లి తదితర గ్రామాల్లో ముంగారు సేద్యం ప్రారంభించారు. మండలంలో 28.4 మి.మీల వర్షపాతం నమోదైంది. ముంగారు సద్యం ప్రారంభం కావడంతో ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది.

బాధితుడికి కందికుంట పరామర్శ



పరామర్శిస్తున్న కందికుంట వెంకటప్రసాద్

గాండ్లపెంట, మే 21: మండలంలోని కటారుపల్లి పంచాయతీలోని గొల్లపల్లిలో ఇటీవల కుక్కల దాడిలో 36 గొర్రెలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ బాధితుడు ఆదెప్పను మంగళవారం పరామర్శించారు. రూ. 50 వేలు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని ఆదెప్పకు హామీ ఇచ్చారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

తనకల్లు: మండలకేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన లక్ష్మీనరసమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కోటపల్లి సింగల్‌విండలో మాజీ అధ్యక్షుడు బాగేపల్లి చలపతి మృతురాలి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి రూ. 7వేలు ఆర్థిక సాయం అందించారు. టీడీపీ కార్యకర్తలకు, కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో బాగేపల్లి అశోక్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విత్తన వేరుశనగ కాయల పరిశీలన



విత్తనకాయలను పరిశీలిస్తున్న ఏడీఏ సనావుల్లా

నల్లచెరువు, మే 21: మండలపరిధిలోని ఎం అగ్రహారం గ్రామంలో నిల్వ ఉంచిన విత్తన వేరుశనగ కాయల నాణ్యతను మంగళవారం ఏడీఏ సనావుల్లా పరిశీలించారు. విత్తన రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. అనంతరం ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వివిధ పంటల సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. వేరుశనగ పంట పూతదశలో ఉన్నపుడు ఎకరాకు రెండువందలకేజీలు జిప్సం, విత్తన వేరుశనగకు శుద్ధి మందులు వాడాలని సూచించారు. కలుపు నివారణకు మందులను పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్న, వరి పంటల నూతన సాగు విధానాలను వివరించారు. సమావేశంలో ఆయనతోపాటు ఏఓ భారతి, వీఏఎలు, వీహెచ్‌ఎలు, వీఎస్‌ఎలు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం: ఏఓ



రైతులతో మాట్లాడుతున్న ఏఓ లోకేశ్వర్‌రెడ్డి

నంబులపూలకుంట, మే 21: ఇన్‌పుట్ సబ్సిడీలో అర్హులైన రైతుల పేర్లు జాబితాలో లేకపోతే విచారించి న్యాయం చేస్తామని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోనిపీఈ కొత్తపల్లి ఆర్బీకే కార్యాలయంలో సోమవారం రైతులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఏఓ మంగళవారం ఆ కేంద్రానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. అర్హులైన రైతులు చాలా మందికి ఇన్‌పుట్ సబ్సిడీ రాలేదని ఈ సందర్భంగా రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్బీకే సిబ్బంది తయారు చేసిన జాబితాను, ఈక్రాప్ బుకింగ్, ఇన్‌పుట్ సబ్సిడీ జాబితాలను పరిశీలించారు. విచారించి న్యాయం చేస్తానని రైతులకు ఆయన హామీ ఇచ్చారు.

గోవింద నామస్మరణతో పులకించిన పట్టుకేంద్రం



రథం వద్దకు ఊరేగింపుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు..



పట్టువస్త్రాలను సమర్పిస్తున్న సత్యకుమార్, పరిటాల శ్రీరామ్



దుకాణాల్లో కొనుగోలు చేస్తున్న మహిళలు

రథోత్సవానికి తరలివచ్చిన భక్తజనం

ధర్మవరం, మే 21: చెన్నకేశవుడి గోవింద నామస్మరణతో పట్టుకేంద్రం పులికించింది. లక్ష్మీచెన్నకేశవస్వామి వారి రథోత్సవం కమనీయంగా సాగింది. మంగళవారం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 7 గంటలకు మడుగుతేరు జరగ్గా సాయంత్రం 4 గంటలకు బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించారు. మడుగుతేరు(రథోత్సవం)కు ఎమ్మెల్యేకేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆలయ ఛైర్మన్ దాశెట్టిసుబ్రహ్మణ్యం, ఈఓ వెంకటేశ్వర్లు తదితరులు హాజరై రథాన్ని లాగి ప్రారంభించారు. ఆలయం వద్ద నుంచి అర్చకులు చెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను గజవాహనంపై ఉంచారు. వేలాది మంది భక్తులు రథం వద్ద పూజలు నిర్వహించి ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం 4గంటలకు బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంతం గోవిందనామస్మరణతో మార్మోగింది. రథోత్సవంలో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య శిష్య బృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రథోత్సవంలో పాల్గొన్న సత్యకుమార్‌యాదవ్, పరిటాలశ్రీరామ్

చెన్నకేశవస్వామి బ్రహ్మ రథోత్సవంలో కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, ధర్మవరం నియోజకవర్గ టీడీ పీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్, పరిటాశ్రీరామ్‌లు రథం వద్దకు చేరుకుని పట్టువస్త్రా లు సమర్పించి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరిశే సు ధాకర్, ఫణికుమార్, భీమనేని ప్రసాద్‌నాయు డు, పురుషోత్తంగౌడ్, అంబటిసనత్, చందారాఘువ, కొత్త పేట ఆది, చీమలరామాంజి అడ్డామహేశ్, కత్తులబాబ్జీ పాల్గొన్నారు.

కిటకిటలాడిన దుకాణాలు

లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా పలు దుకాణాలు వెలిశాయి. రథోత్సవానికి తరలివచ్చిన భక్తులను దృష్టిలో ఉంచుకుని పిల్లల ఆటవస్తువులు, మహిళలకు గాజులు, ఇంటి అలంకారానికి ప్లాస్టిక్ వస్తువులకు సంబంధించిన దుకాణాలు వెలిశాయి. రథోత్సవానికి వచ్చిన పలువురు భక్తులు ఆయా దుకాణాల్లో వస్తువులను కొనుగోలు చేశారు.

భారీ బందోబస్తు

శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు సుబ్రహ్మణ్య బందోబస్తు నిర్వహించారు.

పలువురి సేవలు...

రథోత్సవం సందర్భంగా పట్టణంలోని పలువురు భక్తులు మంగళవారం సేవలందించారు. 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాదనాయుడు అన్నప్రసాదాలు పంపి ణీ చేశారు. టీడీపీ నాయకులు మజ్జిగను ఏర్పాటు చేయగా కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ పంపిణీచేశారు. తొగటవీరక్షత్రియులు, ఆదర్శసేవాసంఘం, వాసవీ హెల్పిం గ్ హ్యాండ్స్, ఆర్యవైశ్య యువజనసంఘం భక్తులకు అన్నప్రసాదాలు, మజ్జిగ, తాగునీటిని అందజేశారు.

అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్

ఓట్ల లెక్కింపునకు ముంచుకొస్తున్న సమయం

ద్వితీయ శ్రేణి నాయకులతో గెలుపోటములపై మంతనాలు



ధర్మవరం, మే 21: పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గర పడుతోంది. ఏ ఇద్దరు ముగ్గురు కలిసినా దీనిపైనా చర్చించుకుంటున్నారు. ఈసారి ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది..? ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయి..? జిల్లాలో ఎవరు గెలుస్తారు..? అన్న అంశాలచుట్టూనే చర్చలు సాగుతున్నాయి. కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ప్రధానపార్టీల అభ్యర్థుల్లోనూ టెన్షన్ మొదలైంది. ద్వితీయ శ్రేణి నాయకత్వంతోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈసారి ఎన్నికలలో పోలింగ్ శాతం పెరగడంతో ఇది తమకు అనుకూలమని ఎన్డీఏ కూటమి అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. తమదే విజయమని చెబుతున్నారు. వైసీపీ అభ్యర్థులు మాత్రం విజయావకాశాలపై ఎక్కడా మాట్లాడటంలేదు. సర్కారుపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఓట్ల రూపంలో వైసీపీని అధికారానికి దూరం చేయనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లకాలంలో చేసిన అభివృద్ధి శూన్యమని, నిత్యావసర వస్తువుల ధరలు, ఆర్టీసీ, కరెంటు చార్జీలు పెంపు, అధిక పన్నుల వసూలుతో ప్రజలు విసిగిపోయారని అంటున్నారు. దీంతో కసితీరా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారని విశ్లేషకులు అంటున్నారు. ఇతర ప్రాంతవాసులు కూడా పెద్దఎత్తున వారి స్వస్థలాలకు తరలివచ్చి పోలింగ్ కేంద్రాల్లో గంటల తరబడి నిరీక్షించి ఓటుహక్కును వినియోగించుకున్నారని, ఇదంతా వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని మేధావులు స్పష్టం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో మొత్తంగా 84.82 శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోల్చితే కాస్త పోలింగ్ శాతం పెరిగింది. ఈవీఎంలలో ప్రజల తీర్పు నిక్షిప్తమైంది. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు హిందూపురం, చోళసముద్రం గురుకుల పాఠశాలల్లోని స్ట్రాంగ్ రూంలకు చేరాయి. అయితే కౌంటింగ్‌కు మరికొద్దిరోజులే ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. తమ అనుచరులతో వారు కూర్చొని ఏయే పోలింగ్ కేంద్రాల్లో ఎన్ని ఓట్లు వచ్చాయి..? మనకి ఎన్ని వస్తాయి..? ప్రత్యర్థి అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడతాయి..? తదితర విషయాలపై చర్చలు సాగిస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ టీడీపీ జోష్ కనిపిస్తోంది. అధికార పార్టీ వైఫల్యాలతోపాటు ప్రభుత్వంపై అన్నివర్గాల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తే ఇందుకు ప్రధాన కారణంగా ఆయా వర్గాలు చెప్పుకుంటున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కడం, కొత్తగా ప్రకటించిన మేనిఫెస్టో చప్పగా ఉండటం కూడా మరో కారణంగా చెబుతున్నారు. వైసీపీ అభ్యర్థులు, నాయకులు పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోనమాత్రం ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ఓటింగ్‌శాతం తమకు ముప్పేనని మథనపడుతున్నారు. కాగా అభ్యర్థుల గెలుపుపై జిల్లాలో జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. కమీషన్ ఏజెంట్లు రంగంలోకి దిగి ఇరువర్గాలను రెచ్చగొట్టి మరీ ఈ తతంగాన్ని నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానిపై కూడా పందెలు కాస్తున్నారు. ఏదీ ఏమైనా ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ఎవరెవరు గెలుస్తారన్నది జూన్ 4వతేదీ వరకు వేచి చూడాలి మరి.

దాడికేసులో ముగ్గురి అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

ధర్మవరంరూరల్, మే 21: మండలంలోని ఓబుళనాయునిపల్లిలో టీడీపీ వర్గీయులపై దాడిచేసిన ఘటనలో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలింగ్ సందర్భంగా ఏజెంట్‌గా లింగమయ్య కొడుకు సింహాద్రి కూర్చున్నాడని వారిపై ఈనెల14న అదేగ్రామానికి చెందిన ఐదుగురు వైసీపీ నాయకులు గడుపూటి గంగాధర్‌నాయుడు, కందేరిఆదినారాయణ, దాసరిశ్రీనివాసులు, సోమశేఖర్, అనంతరాయుడు దాడిచేశారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. దాడిచేసిన వారిలో దాసరిశ్రీనివాసులు, సోమశేఖర్, అనంతరాయుడులను మంగళవారం రూరల్ పోలీసులు అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచారు. కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా ఘర్షణలు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు గ్రామాల్లో 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఫ్యాక్షన్‌గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచామని ఎవరైనా ఘర్షణలకు దిగినా, ప్రోత్సాహించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పోలీసుల తనిఖీలు

నల్లచెరువు, మే 21: మండలంలోని రాజమోళ్లపల్లి, రాజమోళ్లపల్లి తండాలో మంగళవారం ఎస్‌ఐ కేఎం లింగన్న, సిబ్బందితో తనిఖీలు చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఎస్‌ఐ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని హెచ్చరించారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతోపాటు ఏఎస్‌ఐ షేక్షావలి, కానిస్టేబుల్ వెంకటరమణ ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

నల్లచెరువు, మే 21: మండకేంద్రంలోని ఎంపీపీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ సోమవారం సభ్యులు హాజరుకాకపోవడంతో మంగళవారం సభను నిర్వహించగా ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, అధికారులు మాత్రమే హాజరయ్యారన్నారు. ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో 90 రోజులు సర్వసభ్యసమావేశం వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఎస్‌ఐ లింగన్న పాల్గొన్నారు.

'నాగేశ్వరరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం'

ధర్మవరం, మే 21: పోరాట యోధుడు కొల్లినాగేశ్వరరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లిపెద్దన్న, ప్రధానకార్యదర్శి జేవీరమణ సూచించారు. స్థానికమున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు సమస్యలపై నాగేశ్వరరావు అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, సీపీఎం నాయకుడు ఎస్‌హెచ్‌బాషా పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

ముదిగుబ్బ, మే21: మండలవ్యాప్తంగా విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీ నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావల్సిన వారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, సెల్ నెంబర్లతో ఆర్బీకేలలోకి వచ్చి డబ్బు చెల్లించి పేర్లు నమోదు చేసుకోలన్నారు.

బత్తలపల్లి: మండలంలోని రైతులు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలకోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ ఓబిరెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు సాగు చేసేందుకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలకోసం పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

సభలు, సమావేశాలు నిర్వహించకూడదు:సీఐ

నల్లమాడ, మే 21: సర్కిల్ పరిధిలో నల్లమాడ, ఓడీసీ, అమడగూరు మండలాల్లో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించరాదని సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ హెచ్చరించారు. ఒకవేళ నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

కదిరిఅర్బన్, మే 21: మాజీ ప్రధానమంతి రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ కార్యాలయంలో ఎస్సీ డిపార్టుమెంటు జిల్లా ఛైర్మన్ కదిరప్ప రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు భాస్కర్, శ్రీనివాసులు, తిరుపాలు, అంజనప్ప, నాగరాజు పాల్గొన్నారు.

ధర్మవరం: రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రోగులకు బ్రెడ్డు పంపిణీచేశారు.

నేటి నుంచి కోటూరు గంగమ్మ ఉత్సవాలు



కోటూరు గంగమ్మ అమ్మవారు

గాండ్లపెంట, మే 21: మండలపరిధిలోని మల్లమీదపల్లి పంచాయతీలోని కోటూరులో వెలసిన గంగమ్మ తల్లి ఉత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జ్యోతులు, బాణాలు ఉత్సవం, గురువారం ఎద్దుల బండ్లతో ఆలయం చుట్టు పానపందారంతో మొక్కులు తీర్చుకునే కార్యక్రమాలతోపాటు సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు గంగమ్మను దర్శించుకోవాలని కోరారు.

నందివాహనంపై ఊరేగిన సంగమేశ్వరుడు



నందివాహనంపై ఊరేగుతున్న సంగమేశ్వరుడు

కొత్తచెరువు, మే 21: సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం సాయంత్రం స్వామివారు నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఎడ్లబండిపై హంసవాహనాన్ని ఏర్పాటు చేసి పుష్పాలతో అలంకరించి పార్వతీపరమేశ్వర ఉత్సవమూర్తులను ఉంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు మనోహర్; నటరాజ్, ఫణి, నాగరాజ్, అర్చకులుసాయి పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

వైభవంగా నృసింహ జయంతి




ఊరేగుతున్నలక్ష్మీనరసింహస్వామి

ధర్మవరం, మే 21: పట్టణంలోని బాబుజగ్జీవన్‌రాంనగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి వేడుకలను మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధులగుండా ఊరేగించారు.

ముగ్గురు కౌంటింగ్ పరిశీలకుల నియామకం

పుట్టపర్తి, మే 21: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్ పరిశీలకులుగా ముగ్గురు అధికారులను నియమిస్తూ ఎన్నికల కమిషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మడకశిర, హిందూపురం నియోజకవర్గాలకు అన్బుకుమార్, పెనుకొండ, కదిరికి దీపక్ రామచంద్రతివారీ, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాలకు స్నేహల్ బీ నాయక్ పాలేకర్‌ను నియమించింది.

పరికరాలకు నిప్పుపెట్టిన దుండగులు



కాలిన డ్రిప్‌పైపులు

పుట్టపర్తి మే 21: కోసిన జొన్నచేనులో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో డ్రిప్‌పైపులు కాలిపోయాయి. జిల్లాకేంద్రంలోని పెద్దకమ్మవారిపల్లికి చెందిన రైతు కోనంకి గంగాధర్‌నాయుడు ఐదు ఎకరాల్లో జొన్న సాగుచేశాడు. ఇటీవల పంటను నూర్పిడి చేశారు. కాగా మంగళవారం జొన్నచేనులో ఆకతాయలు నిప్పుపెట్టడంతో ఎండుగడ్డితోపాటు రూ. లక్షా 50 వేల విలువచేసే డ్రిప్‌పైపులు కాలిపోయినట్టు బాధిత రైతు వాపోయాడు.

పకడ్బందీగా నిర్వహించండి: డీఆర్‌ఓ

పుట్టపర్తి మే 21: ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగానిర్వహించాలని డీఆర్‌ఓ కొండయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24వతేదీ నుంచి జూన్ 1 వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2-30 నుంచి 5-30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో 10461 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, ఇందులో మొదటి సంవత్సరానికి సంబంధించి 7501 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2960 మంది హాజరుకానున్నారన్నారు. వీరికోసం 28 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పరీక్ష నిర్వహణ అధికారి రఘునాథరెడ్డి తెలిపారు.

అధ్వానంగా చౌటకుంటపల్లి తారు రోడ్డు

నల్లమాడ, మే 21: మండలంలోని చౌటకుంటపల్లి నుంచి దొన్నికోట మీదుగా నల్లమాడ, కదిరికి వెళ్ళే ప్రధాన రహదారికున్న లింక్‌తార్‌రోడ్డు గుంతలయమంగా మారింది. ఈ రోడ్డులో వెళ్లాలంటే వాహనచోదకులు భయానికి గురవుతున్నారు. దాదాపు 20యేళ్ల క్రితం తారురోడ్డు వేశారని, ప్రస్తుతం ఆ రోడ్డు గుంతలమయంగా మారిందని గ్రామస్థులు అంటున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదని అంటున్నారు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో కదిరి నుంచి నల్లమాడకు వెళ్లే బస్సులుసైతం చౌటకుంటపల్లిమీదుగా కాకుండా ఎద్దులవాండ్లపల్లి తండా మీదుగా వెళ్తున్నట్లు వాపోతున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారి లింక్ రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



గుంతలమయంగా రోడ్డు

పురం దుర్గంధభరితం..!

● వర్షం వస్తే రోడ్లపైకి మురుగు
● డ్రైనేజీ అస్తవ్యస్తం

హిందూపురం అర్బన్, మే 21: జిల్లాలో ఏ1 మున్సిపాలిటీగా పేరు పొందిన హిందూపురంలో శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా పరిణంది. డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయి మురుగు ముందుకు కదలడం లేదు. కదిలిస్తే కంపు కొట్టేంతగా మారాయి. పట్టణ నలుమూలలా డ్రైనేజీలు ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలతో నిండిపోయాయి. దీంతో మురుగునీరు కదలక ఉండిపోయింది. ఎప్పటికప్పుడు శుభ్రపరిచి వ్యర్థపదార్థాలను తొలగిస్తే తప్ప మురుగు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ప్లాస్టిక్ వినియోగం ఎక్కువ కావడం, వ్యర్థాలను కాలువల్లో పడివేయడం ద్వారా డ్రైనేజీ వ్యవస్థకు అంతరాయం కలుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వర్షం కురిస్తే నీరు డ్రైన్‌లపై నుంచి ప్రవహించి చెత్తా చెదారం అంతా రోడ్లపైకి చేరుతోంది. వాహనదారులు, పాదచారులు, ఆ మురుగు నీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.


లక్ష్మీపురం 10 వార్డు సచివాలయం సమీపంలో...

ఆక్రమణలతోనే సమస్య: పట్టణంలో ఎడాపెడా కట్టడాలు నిర్మిస్తున్నారు. కాలువలు, వంకలు, డ్రైనేజీలపై అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో కాలువల్లో నీరు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియంత్రించాల్సిన మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నియంత్రించాలని వెళ్తే కొన్ని చోట్ల రాజకీయనాయకుల ఒత్తిడి, కౌన్సిలర్ల పెత్తనంతో వ్యవస్థ నిర్వీర్యమైంది. అధికారులు ప్రజలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలి కానీ పాలకులకు వత్తాసుపలకడంతో పురంలో ఐదు సంవత్సరాలుగా ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. గడ్డ మీద ప్రాంతం, రహమత్‌పురం, నేతాజీనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీపైనే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోలేదు. సోమవారం హిందూపురంలో కురిసిన వర్షానికి ఎగువ ప్రాంతాలైన గడ్డమీద, సూరప్పకుంట, కంసలపేట, బోయపేట, సత్యనారాయణపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు, హస్నాబాద్, ప్రధాన రహదారి రైల్వే రోడ్డులో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తెల్లారే వరకు వర్షం నీరు రోడ్లపైనే ఉంది. అనంతరం నీరు కాలువల్లో మెల్లగా వెళ్లిపోయినా చెత్తాచెదారం మాత్రం రోడ్లపైనే ఉండిపోయింది. దీంతో ప్రజలు దుర్గంధంతో అల్లాడిపోతున్నారు. అలాగే శ్రీకంఠపురం, లక్ష్మీపురం, తదితర ప్రాంతాల్లో డ్రైన్లు లేక మురుగునీటి కుంటను తలపిస్తోంది. మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నా డ్రైన్లు నిర్మించడంలో అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షాకాలంలోనైనా డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.


శ్రీకంఠపురం సడ్లపల్లి రోడ్డులో, బ్యాల్లమిషన్ ప్రాంతంలో ఇలా...

చాలా ఇబ్బందులు పడుతున్నాం



డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కాలువల్లో మురుగునీరు ముం దుకు కదలదు. కంపు వదలదు. దీనికి తోడు డ్రైనేజీలు లేవు. వర్షం వస్తే మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు ఉత్పత్తి పెరిగి వ్యాధులబారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది.

- రామాంజనేయులు, శ్రీకంఠపురం

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాం

పట్టణంలో పలు చోట్ల అక్రమ కట్టడాలు నిర్మించిన విషయం మా దృష్టికి వచ్చింది. వాటిపైన సర్వే చేస్తున్నాం. కొన్ని చోట్ల కాలువలు శుభ్రం చేయడానికి వీలు లేకుండా కట్టడాలు నిర్మించారు. త్వరలో వాటిని తొలగిస్తాం. అలాగే గ్యాంగ్ వర్క్ చేపట్టాం. కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. ప్రజలు ప్లాస్టిక్ వాడకం ఎక్కువ కావడం, వాటిని కాలువల్లో పడివేయడంతో కాలువలు నిండిపోతున్నాయి. అలాకాకుండా ఇంటి వద్దకు చెత్త సేకరణకు వచ్చే సిబ్బంది తెచ్చే డస్ట్‌బిన్‌లలో చెత్తను వేస్తే కాలువల్లో మురుగు ఉండదు. ఇందుకు ప్రజలు సహకరించాలి.

- శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న ప్రజాసంఘాలు


పెన్నానదిలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

హిందూపురం, మే 21: పెన్నానది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లను యథేచ్ఛగా తరలిస్తున్నారన్నారు. దీనిపై అధికారులకు తెలిపినా స్పందించలేదన్నారు. మంగళవారం సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు సంతేబిదనూరువద్ద పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. 9 ట్రాక్టర్లను రూరల్ పోలీసులకు అప్పగించారు. వారు మాట్లాడుతూ అక్రమంగా మూడు నెలలుగా వేబిల్లులు చూపుతూ నిత్యం 30 ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారన్నారు. దీనిపై జిల్లా అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించలేదన్నారు. ఈ ప్రాంతంలో రైతులకు నీరులేక ఇబ్బందులు పడుతున్నారని, ఇసుక తరలిస్తే భూగర్భజలాలు ఇంకిపోతాయన్నారు. విషయం తెలుసుకుని సెబ్ అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు ట్రాక్టర్లను తరలించారు. సీపీఐ నాయకులు వినోద్, తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం నాయకులు రవికుమార్, నాగరాజు, అబూబకర్, జబీవుల్లా, అంజాద్, బాబు, మూర్తి, గంగాధర్ పాల్గొన్నారు.

పర్మిట్‌లేని కర్ణాటక బస్సులను నిలువరించండి


డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

హిందూపురం అర్బన్, మే 21: ఆంధ్రా పర్మిట్లు లేకుండా హిందూపురంలోకు వస్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సులను నిలువరించాలని నేషనల్‌మజ్దూర్ యూనియన్ నాయకులు మంగళవారం డీఎం శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల మెజారిటీ యూనియన్ సభ్యుల అభిప్రాయాలు తీసుకోకుండా సర్వీసులను తొలగించడంపై ఎన్‌ఎంయూ నాయకులు స్పందించారు. పర్మిట్‌లు లేకుండా కర్ణాటక బస్సులు ప్రతి 5 నిమిషాలకు ఒకటి వస్తోందని, అదే హిందూపురం డిపో బస్సులు కేవలం 4 మాత్రమే నడుపున్నారన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ హిందూపురం డిపోకు భారీగా ఆదాయానికి గండి పడుతుందన్నారు. కార్మికులలో ఉన్న అసంతృప్తిని పోగొట్టి 8 గంటల పని, 9 గంటల సర్వీసును పునరుద్ధరించాలని, ప్రశాంత వాతావరణంలో ఉద్యోగాలు పని చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

వర్షానికి విరిగిపడిన చెట్టు


రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టు

రొద్దం, మే 21: పెద్దకోడిపల్లి గ్రామంలో పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా చెట్టుపడింది. మంగళవారం మండల పరిధిలోని పెద్దకోడిపల్లి గ్రామ చివరన 5గంటల సమయంలో గాలి వీయడంతో రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగి పడింది. విద్యుత్ తీగలపై చెట్టు పడినా ఎలాంటి ప్రమాదం జరగలేదు. గ్రామస్థులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా వెంటనే విద్యుత్ సరఫరా ఆపేశారు. విద్యుత్ అధికారులు రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

చోళసముద్రంలో పోలీసుల తనిఖీలు


చోళసముద్రం గ్రామంలో సోదాలు చేస్తున్న పోలీసులు

లేపాక్షి, మే 21: సార్వత్రిక ఎన్నికల్లో చోళసముద్రం గ్రామంలో పోలింగ్ సందర్భంగా ఘర్షణలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. వరుసగా రెండు రోజులు జరిగిన ఘర్షణలో కొంతమంది గాయపడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పోలీసులు పోలింగ్ ముగిసిన తరువాత ఎలాంటి గొడవలు జరగకుండా మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రూరల్ సీఐ ఈరన్న ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో తనిఖీ చేశారు. దుకాణాలు, అనుమానిత ఇళ్లలో సోదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపీ, పోలీసులు పాల్గొన్నారు.


మడకశిర రూరల్: నియోజకవర్గంలోఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా, ప్రేరేపించినా కఠిన చర్యలు తప్పవని సీఐ మనోహర్ హెచ్చరించారు. మండలంలోని హరేసముద్రం గ్రామంలో మంగళవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మొదట గ్రామంలో ఇంటింటా సోదాలు నిర్వహించారు. అనుమానాలున్న వ్యక్తులపై ఆరాతీశారు. ఎటువంటి డాక్యుమెంట్‌లేని 8 బైకులను సీజ్‌చేశారు. అనంతరం గ్రామస్థులతో సమావేశాం ఏర్పాటుచేశారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, రాజకీయంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రైవింగ్ స్కూల్ కారు ఢీకొని యువకుడికి గాయాలు

హిందూపురం, మే 21: పట్టణంలోని ఎంజీఎం పాఠశాల క్రీడా మైదానం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం డ్రైవింగ్ స్కూల్ కారు ఢీకొని వంశీకృష్ణ అనే యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన చోటుచేసుకుంది. ద్విచక్రవాహనంలో వస్తున్న వంశీకృష్ణను శ్రీనివాస డ్రైవింగ్ స్కూల్‌కు చెందిన కారు శిక్షణలో ఉన్న వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో వంశీకృష్ణకు గాయాలయ్యాయి. యువకుణ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పినట్లు తెలిసింది. అయితే దీనిపై కేసు నమోదు కాలేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

గోరంట్లలో మళ్లీ చోరీ

● 67గ్రాముల బంగారం, 40గ్రాముల వెండి..


ఇంటిలో చెల్లాచెదురుగా పడిన ఉన్న దుస్తులు

గోరంట్ల, మే 21: వరుస చోరీలతో గోరంట్ల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని పులేరు వీధిలో నివాసముంటున్న చేనేత కార్మికుడు వడ్డె క్రిష్టప్ప ఇంట్లో సోమవారం రాత్రి దొంగలుపడి 67గ్రాముల బంగారం, 40గ్రాముల వెండి కుంకుమ భరణిలు, రూ.10 వేల నగదు చోరీ చేశారు. క్రిష్టప్ప, సునీత దంపతులు మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటికి తాళం వేసి శనివారం తిరుపతికి వెళ్లి మంగళవారం ఉదయం తిరిగి వచ్చారు. పక్క ఇంట్లో నివాసముంటున్న సునీత తండ్రి చిన్నప్పయ్య ప్రతిరోజు ఇంటి ముందు నిద్రించేవాడు. సోమవారం రాత్రి వర్షం రావడంతో ఇంట్లో నిద్రించాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తలుపుల బద్దలు కొట్టి బీరువాలో ఉంచిన విలువైనఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. రెండు బంగారు నెక్లెస్‌లు, జత కమ్మలు, జుమ్కీలు, చైను, ఉంగరంతో పాటు రెండు వెండి కుంకుమ భరణిలు, రూ.10 నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా ఈనెల 10న తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని కేశవాచారి ఇంటి తాళాలు పగల కొట్టి 160గ్రా. బంగారు నగలు, రూ.4.10లక్షల నగదు, చోరీ చేసిన విషయం తెలిసిందే. కొంతకాలంగా గోరంట్లలో వరస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. వరుస చోరీలపై పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా దృష్టికి తీసుకెళ్లగా ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసిన తరువాత చోరీలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

కన్నుల పండువగా లక్ష్మీ నారసింహుడి కల్యాణం

హిందూపురం అర్బన్, మే 21: పట్టణ పరిధిలోని నింకంపల్లిలో వెలసిన లక్ష్మీనారసింహస్వామి కల్యాణం కన్నుల పండువగా సాగింది. తెల్లవారుజాము నుంచే మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం మంగళవారం క్రోధినామ సంవత్సరం వైశాఖశుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని వేద పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలు మంగళ వాయిద్యాలతో కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి స్వామివారి కల్యాణం, 1 గంటకు మంత్రపుష్పం, మహానైవేద్యం, మహామంగళహారతి అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. బుధవారం కలశ వాహనాది, అగ్ని కార్యాది హవనములు, 9 నుంచి 10 గంటలకు పూర్ణాహుతి, 10.30 గంటలకు మహిళలచే దీపోత్సవం, అనంతరం స్వామివారికి విశేష మంత్రపుష్పం, మహానైవేద్యం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, 4 గంటల నుంచి ప్రత్యేక వాహనంలో స్వామి వారి ఉత్సవ విగ్రహంతో నగరోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అర్చకులు వేణునాథన్, యజ్ఞాచార్యులు చక్రపాణి ఆచార్యులు, ఆలయ అధ్యక్షుడు నాగరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

విద్యానగర్‌లో: పట్టణ పరిధిలోని విద్యానగర్‌లో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కల్యాణ వేడుకలు రమణీయంగా సాగాయి. మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణలతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపించారు. సాయంత్రం పురవీధుల్లో దేవతామూర్తుల విగ్రహాలతో నగరోత్సవం నిర్వహించారు.

వర్షానికి దెబ్బతిన్న ఇల్లు


కూలినపైకప్పును చూపుతున్న అశ్వత్థనారాయణ

రొద్దం, మే 21: మండలంలోని నూతన దళితవాడలో అశ్వత్థప్ప కుమారుడు బాబు ఇంట్లో నిద్రిస్తుండగా సోమవారం రాత్రి పైకప్పు కూలింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పైకప్పు దెబ్బతిని బెడ్‌రూమ్ గది కూలింది. అదృష్టవశాత్తు బెడ్‌రూమ్‌లో ఎవ రూ పడుకోకపోవడంతో ప్రమా దం తప్పినట్లయింది. హాలులో నిద్రిస్తున్న బాబు పైకప్పుకూలడంతో భయపడి బయటికి పరుగులు తీశాడు. ప్రభుత్వం ఆర్థిక సాయంతోపాటు ఇల్లు మంజూరు చేయాలని బాధితుడు అధికారులకు విన్నవించాడు.

తూతూమంత్రంగా మండల సమావేశం

పెనుకొండ రూరల్, మే 21: మండల సమావేశాన్ని అధికారులు తూతూ మంత్రంగా ముగించేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విశ్వమోహన్, ఎంపీపీ గీత అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించిన సమావేశానికి వివిధ శాఖాధికారులు పాల్గొని సంక్షేమ పథకాలపై వివరించారు. 11పంచాయతీలకుగాను 11సర్పంచులుండగా కేవలం శెట్టిపల్లి, మునిమడుగు పంచాయతీలకు చెందిన అధికారులు మాత్రమే హాజరుకాగా మిగిలినవారు గైర్హాజరయ్యారు. దీంతో వచ్చినవారితోనే తూతూమంత్రంగా సమావేశం ముగించారు. ఏపీఓ జయమ్మ, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ డీఈ శ్రీనాథ్, వైస్ ఎంపీపీ రామాంజి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి


రాజు (ఫైల్)

అగళి, మే 21: మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త తిరుమలప్ప గారి రాజు(38) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజు మృతిచెందిన విషయం తెలియగానే టీడీపీ జడ్పీటీసీ ఉమేష్, మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉమేష్ మాట్లాడుతూ రాజు మృతి టీడీపీకి తీరనిలోటన్నారు. ఆయన కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి


ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ మంజువాణి

చిలమత్తూరు, మే 21: వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి మంజువాణి సూచించారు. ఆమె సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి బీసీజీపై వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఆసుపత్రిలో సుఖ ప్రసవాలు ఎలా జరుగుతున్నాయి? బాలింతలకు, శిశుల ఆరోగ్యాలపట్ల జాగ్రత్త వహించాలని ఆమె సూచించారు. అనంతరం కాన్పుల గదిని, రోగుల బెడ్లను పరిశీలించారు. గ్రామాల్లో జ్వరాలు, ఇతరత్రా జబ్బుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరాలపై సమగ్ర సమాచారం తీసుకొని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. డాక్టర్ రామకృష్ణ, పీహెచ్‌ఎన్ లీలావతి, సూపర్‌వైజర్ గోవిందప్ప, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

రోడ్డుకు అడ్డంగా మట్టి


ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుకు అడ్డంగా మట్టిని వేస్తున్న దృశ్యం

రొద్దం, మే 21: మండలంలోని కందుకూర్లపల్లికి వెళ్లే దారికి అడ్డంగా ఎక్స్‌కవేటర్‌తో చాకలి నారాయణప్ప అనే రైతు మట్టిని వేశాడు. మంగళవారం నారాయణప్ప పొలం వద్దనున్న రోడ్డు తనదేనని మట్టి ని వేశాడు. సుబ్బయ్య, చాకలి నారాయణప్ప పొలాలకు కందుకూర్లపల్లి-రొద్దంకు రోడ్డు వెళ్తుంది. ఇద్దరు రైతులు నా పొలంలో రోడ్డు వెళ్ల కూడదని అడ్డు చెబుతుండటంతో కొన్నేళ్లుగా సమస్య నెలకొంది. రొద్దం గ్రామానికి చెందిన చాకలి నారాయణప్ప రోడ్డుకు అడ్డంగా మట్టిని వేయడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. రెవెన్యూ అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ వలంటీర్ హత్యకేసులో ఆరుగురి అరెస్టు


హత్య వివరాలను వెల్లడిస్తున్న పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా

గోరంట్ల, మే 21: మండలంలోని కొత్తబయ్యన్నపల్లి వద్ద 19వ తేదీన మల్లాపల్లిమాజీ వలంటీర్ అనిల్‌కుమార్‌యాదవ్ హత్యకేసులో కొత్తచెరువుకు చెందిన ఆరుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు పెనుకొండ డీఎస్పీ బాజీ జాన్‌సైదా విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. కొత్తచెరువుకు చెందిన దూదేకుల సైపుల్లా, ముష్టూరి కుమార్, రఘునాథ్‌యాదవ్, పల్లపు గణేషకుమార్, చింతకాయల హేమంత్‌కుమార్, సాయినాథ్‌యాదవ్‌లను సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. కొత్తచెరువుకు చెందిన వీరంతా స్నేహితులుకాగా, కుమార్‌కు చెందిన కారులో గోరంట్ల సరిహద్దు కర్ణాటక రాష్ట్రం పెసలపర్తికి మద్యం సేవించేందుకు 19వతేదీన వెళ్లారు. అదే సమయంలో మాజీ వలంటీర్ అనిల్‌కుమార్‌యాదవ్, స్నేహితులు నరసింహమూర్తి, వెంకటనరేష్‌లతో కలిసి మద్యం సేవించడానికి పెసలపర్తి వెళ్లారు. వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం తిరుగు ప్రయాణంలో కొత్తచెరువు వాసులు కొత్తబయ్యన్నపల్లి వద్ద ద్విచక్రవాహనాలకు కారు అడ్డంగా పెట్టి దాడికి పాల్పడ్డారు. అనిల్‌కుమార్‌ను తీవ్రంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. వదిలేసి వెళ్లిన కారును స్వాధీనం చేసుకుని, ఆరుగురిపై హత్యకేసు నమోదు కాగా, నిందితులు వీఆర్‌ఓ ఓబులేసు వద్ద లొంగిపోగా, ఆయన వారిని గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. వారిని సీఐ అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

ఫిట్‌నెస్ కోసం డాక్టర్‌తో పోలీసుల వాగ్వాదం

అనిల్‌కుమార్ హత్యకేసులో నిందితులైన ఆరుగురికి మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ విషయంలో మెడికల్ ఆఫీసర్ పావని, పోలీసుల మధ్య మంగళవారం వివాదం చోటుచేసుకుంది. కొత్తచెరువుకు చెందిన నిందితులను హత్యకేసులో అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరిచే ముందు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అవసరం కాగా గోరంట్ల సీహెచ్‌సీకి పోలీసులు మంగళవారం వెళ్లారు. లీగల్ కేసులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చే సౌకర్యం ఆసుపత్రిలో లేదని డాక్టర్ చెప్పడంతో పోలీసులు నిందితులను తీసుకెళ్లారు. అనంతరం సీఐ సుబ్బరాయుడు, ఏఎస్ఐ మద్దిలేటి ఆసుపత్రికి వెళ్లి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌పై చర్చించారు. మెడికల్ సర్టిఫికెట్ ఇస్తానని, ఫిట్‌నెస్ ఇవ్వడానికి వీలు లేదని డాక్టర్ తెలిపారు. డీసీహెచ్‌ఎస్ రవిపాల్‌తో డాక్టర్ ఫోన్‌లో సంప్రదించి సీఐతో మాట్లాడేలా చేశారు. డీసీహెచ్‌ఎస్ అలా ఇవ్వడానికి వీలు పడదని ఫోన్లలోనే తెల్పి చెప్పారు. పై అధికారి ఆదేశం మేరకు డాక్టర్ సర్టిపై చేసినా, అలాకాదంటూ 54సీఆర్‌పీసీ అని రాస్తూ ధృవీకరించాలని పోలీసులు పట్టుపట్టారు. రిమాండ్ నిందితులను హాజరు పరచడానికి ఆలస్యమవుతోందని, ఇందుకు కారకులైన డాక్టర్‌పై కోర్టులో ఫిర్యాదు చేస్తామంటూ ఒత్తిడి తెచ్చారు. డాక్టర్ ససేమిరా అనడంతో తిరిగి వెళ్లిన పోలీసులు సాయంత్రం మళ్లీ ఆసుపత్రికి వచ్చి, డాక్టర్‌తో చర్చించారు. ఎన్నికల కౌంటింగ్ ముగిశాక రికార్డులతోపాటు మెడికల్ లీగల్, ఫిట్‌నెస్ ధ్రువీకరించేలా ఆసుపత్రికి ఆదేశాలు ఇస్తామని తెలిపారు. దీనిపై డాక్టర్ పోలీసులకు వివరిస్తూ, గోరంట్లలో సౌకర్యం లేకపోవడంతో పెనుకొండ ఆసుపత్రికి ఫార్వర్డ్ చేస్తూ ధ్రువీకరించడంతో పోలీసులు తీసుకెళ్లారు. దీంతో సమస్య సద్దుమణిగింది.


డాక్టర్ పావనితో చర్చిస్తున్న సీఐ సుబ్బరాయుడు, పోలీస్ సిబ్బంది

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం


మారెమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మడకశిర రూరల్, మే 21: మండలంలోని ఆమిదాలగొంది గ్రామ సమీపంలో ఉన్న కనుమ మారెమ్మకు జ్యోతుల ఉత్సవం మంగళవారం వైభంగా నిర్వహించారు. మడకశిర, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున జ్యోతులతో ఊరే గింపుగా వెళ్లి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగాకురిసి పంటలు బాగాపండాలని అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నట్లు భక్తులు తెలిపారు.

గుడిబండ: మండలంలోని జీఎస్ తండాలో మంగళవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో మారెమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు ఐకమత్యంతో గొడవలు, ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ఉత్సవాలు చేపట్టారు. అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి హారతులు మోసి మొక్కు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

సుంకులమ్మకు జ్యోతులు..


జ్యోతులు మోస్తున్న మహిళలు

హిందూపురం అర్బన్, మే 21: పట్టణ పరిధిలోని శ్రీకంఠపురం వడ్డెర్ల ఆరాధ్యదైవం, గ్రామదేవత సుంకులమ్మకు మంగళవారం మహిళలు టజ్యోతులు పట్టారు. ప్రతి ఏడాది గ్రామదేవతకు జోతులు మోయడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో మహిళలు జ్యోతులు మోశారు. డప్పుల సవ్వడితో పరిసర ప్రాంతం మార్మోగింది. మూల విరాట్‌కు పూలు నగలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు ప్రసాదపంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ దుర్గామంజుల, వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు రంగప్ప, ఉపాధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి దుర్గానవీన్, నాగరాజు, వెంకటేష్, అక్కులప్ప, సునీల్, నాని, శివ, గోవిందు, గురుశంకర్, కెంచప్ప, జయచంద్ర పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి ధ్వజారోహణం


ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

మడకశిర టౌన్, మే 21: పట్టణంలోని కోట వేంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారి ధ్వజారోహణ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. కలశ స్థాపన, భేరిపూజ, అగ్నిప్రతిష్ఠ, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠాపన

మడకశిర టౌన్, మే 21: పట్టణంలోని గాంధీబజార్‌లో వెలసిన దిగువపేట ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విమానగోపుర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలశ పూజ, హోమం, అన్నప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మడకశిరలో మోస్తరు వర్షం

మడకశిర, మే 21: నియోజకవర్గంలో రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షాలు పడుతుండడంతో చెరువులు, కుంటలకు నీరుచేరుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే పలు రహదారులు వర్షాలకు చిత్తడిగా మారాయి. పలు చోట్ల కుంటలకు నీరు చేరుతుండడంతో జళకళను సంతరించుకుంటున్నాయి. రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. సోమవారం మడకశిర మండలంలో 12.6 మి.మీటర్లు, అమరాపురంలో 41.6, గుడిబండ 9.4, అగళిలో 16.2, రొళ్లలో 16.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కారం


డంపింగ్ యార్డులోని వ్యర్థాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోరంట్ల, మే 21: పట్టణంలోని రావికుంట చెరువు వద్దనున్న డపింగ్‌యార్డులో చెత్తకు తరచూ నిప్పుపెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అధికారులు మంగళవారం స్పందించి డంపింగ్ యార్డులో మరమ్మతు పనులు చేపట్టారు. రావికుంట చెరువు పక్కనే వారపు కూరగాయాల సంత, రెడ్డివారి వీధి, జామీయా మసీదు ప్రాంతం, ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పొగ పీల్చడంతో శ్వాస సంబంధిత వ్యాధులతో అనారోగ్యానికి గురవుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతిలో డంపింగ్‌యార్డు కంపు అనే కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ స్పందించి సమస్యను పరిష్కరించాలని కార్యనిర్వాహణాధికారి బాబురావును ఆదేశించారు. ఆయన ఎక్స్‌కవేటర్ సాయంతో డంపింగ్ యార్డులో కాలి బుడిదైన వ్యర్థాలను లోతట్టు ప్రాంతంలోని గుంతలోకి వెస్తూ చదును చేయించారు. ఇకపై డంపింగ్ యార్డుకు చెత్త తరలించరాదని ఎంపీడీఓ ఆదేశించారు.